

రాష్ట్రంలో నిరంతర ఉచిత విద్యుత్ - 8లో▸

రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ నిరంతరంగా ఉచిత విద్యుత్ ఇస్తున్నాడని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.



కొలువు..గెలువు

పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు మైనార్టీస్ స్టడీ సర్కిల్, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనుంది. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $29^0/23^0$

జిల్లాలో ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు కురుస్తాయి. పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం పడే అవకాశం ఉంది

ఉప్పొంగుతున్న వాగులు

ఎడతెరిపి లేని వర్షంతో వాగుల్లోకి వచ్చి చేరుతున్న వరద

- లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు
- ఏటూరునాగారంలోని 3వ వార్డులోకి వర్షపు నీరు



ఏటూరునాగారంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న దయ్యాలవాగు

ములుగు/ఏటూరునాగారం/కన్నాయిగూడెం/వాజేడు/ వెంకటాపురం(కె): జిల్లాలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం పడుతుండడంతో పలు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఏజెన్సీలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. పలు చోట్ల రాకపోకలకు అంతరాయం కలిగింది.

జిల్లాలోని ఏటూరునాగారం మండల పరిధిలోని 163 జాతీయ రహదారిపై ఉన్న దయ్యాలవాగు ఉధృతంగా ప్రవహించడంతో ఒడ్డువెంట ఉన్న పొలాలు ఒర్రిపోతున్నాయి. వరద నీరు మరింత పెరిగే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. అలాగే బూటారం వద్ద కూడా దయ్యాలవాగు ఉధృతంగా ప్రవహించడంతో పొలాల్లోకి నీరు వచ్చి చేరుతుంది. రొయ్యూర్ సమీపంలో వర్షపు నీరు, వాగు నీరు మిర్చి తోటల వద్దకు చేరడంతో చెరువులను తలపిస్తోంది. ఎలిశెట్టిపల్లి వద్ద దయ్యాలవాగు ఉప్పొంగడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఎలిశెట్టిపల్లి, కొత్తూరు, గొత్తికోయలగూడేంలోని ప్రజలకు రాకపోకలు స్థంభించడంతో నిత్యావసరాల కోసం అడవిలోని బాటను పట్టుకొని మండల కేంద్రానికి చేరుకుని అదే మార్గంలో తిరిగి ఇళ్లకు చేరుకుంటున్నారు. అంతేకాకుండా స్థానిక సీఐ రాజు తన సిబ్బందితో వాగు ఉధృతిని పరిశీలించి వాగు ఎవరూ దాటొద్దని సూచించారు. ఏదైనా అత్యవసరమైతే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మండల కేంద్రంలోని 3వ వార్డు దళిత కాలనీలో ఇళ్లలోకి వర్షపు నీరు రావడంతో పలువురి ఇళ్ల గోడలు నేలమట్టం కాగా మరికొంత మంది నీటిని ఎత్తిబయట పారబోసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ అధికారులు జేసీబీ ద్వారా నీరు బయటకు వెళ్లే విధంగా కాల్వలను శుభ్రం చేయడంతో పాటు అడ్డుగా ఉన్న మట్టికట్టలను తవ్వి నీటిని బయటకు పంపించే ప్రయత్నం చేస్తున్నారు.

'దొంగలగుట్ట'తో రాకపోకలకు అంతరాయం..

కన్నాయిగూడెం మండల పరిధిలోని ఐలాపూర్, కంతనపల్లి, కొర్ల, బురుదోని వాగులు పొంగి పొర్లుతుండడంతో రాకపోకలు పూర్తిగా స్థంభించాయి.



ఏటూరునాగారం ఎస్సీ కాలనీలో వర్షపు నీరు

దీంతో మండల కేంద్రానికి– గ్రామాలకు పూర్తిగా సంబంధాలు లేకుండా పోయాయి. ఎన్ని ప్రభుత్వాలు మారినా రవాణా కష్టాలు మాత్రం తీరడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా ఏటూరునాగారం, తుపాకుల గూడెం, పలిమెల, మహదేవపూర్, భూపాలపల్లి , మహారాష్ట్రలను కలుపుతూ ఉన్న ప్రధాన రహదారికి మండల పరిధిలోని కంతనపల్లి చెరువు సమీపంలో ఉన్న దొంగలగుట్ట వాగు లోలెవల్ వంతెన పై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రహిస్తుండడంతో రవాణాకు అంతరాయం ఏర్పడింది. దీంతో 2 నుంచి 3గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. ఉధృతి తగ్గిన తర్వాత మళ్లీ రాకపోకలు సాగాయి.

జిల్లా వ్యాప్తంగా మంగళవారం నమోదైన వర్షపాతం

మండలం	వర్షపాతం (ఎంఎం)
ములుగు	30.4
వెంకటాపురం(ఎం)	82.3
గోవిందరావుపేట	73.2
ఎస్ఎస్ తాడ్వాయి	67.4
ఏటూరునాగారం	84.2
మంగపేట	66.1
కన్నాయిగూడెం	98.4
వాజేడు	58.4
వెంకటాపురం(కె)	65.8

కంకల, కొంగాల వాగుల ఉధృతి..

వెంకటాపురం(కె) మండల పరిధిలోని కంకల వాగు, రాచపల్లి, హనుమంతుని వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో మల్లాపురం, కర్రవాని గుంపు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలకు వెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. అదే విధంగా వాజేడు మండల పరిధిలోని పేరూరు వద్ద గోదావరి క్రమేపి పెరుగుతూ ప్రస్తుతం 11 మీటర్ల నీటిమట్టానికి చేరుకుంది. అదే విధంగా మండల కేంద్రం సమీపంలోని కొంగాల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.



వాజేడు: పూసూరు బ్రిడ్జి వద్ద గోదావరి



వెంకటాపురం(కె): కంకల వాగు



హనుమంతుని వాగు పరవళ్లు



దొంగలగుట్ట వాగు వద్ద నిలిచిన వాహనాలు

జలగలంచ వాగు పరిశీలన



జలగలంచ వాగును పరిశీలిస్తున్న కలెక్టర్

ఎస్ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం తనిఖీ చేసిన అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి తాడ్వాయి – పస్రా మధ్యలోని లవ్వాల స్టేజీ సమీపంలోని జలగలంచ వాగును పరిశీలించారు. గతేడాది వర్షాలకు వాగు ఉధృతికి బ్రిడ్జి వద్ద రోడ్డు కొట్టుకపోయి రవాణాకు తీవ్ర అంతరాయం కలిగిందని తహసీల్దార్ శ్రీనివాస్ కలెక్టర్‌కు వివరించారు. ఈ దఫా తగిన రక్షణ చర్యలు తీసుకుని రవాణాకు ఆటంకం కలుగకుండా చూడాలని ఎన్‌హెచ్ ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్ ఉన్నారు.

కాళేశ్వరాలయం హుండీ లెక్కింపు



కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంతో పాటు అనుబంధ దేవాలయాల హుండీల్లో భక్తులు కానుకల రూపంలో వేసిన నగదును మంగళవారం లెక్కించినట్లు ఈఓ ఎస్.మహేష్, దేవస్థానం చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. హుండీలను విప్పి నగదు లెక్కించగా రూ.21,38,620 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఈ లెక్కింపు ఆలయ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నగదును సేవాసమితి సభ్యులు లెక్కించారు. సర్పంచ్ వసంత, ధర్మకర్తలు సమ్మయ్య, రాంరెడ్డి, సత్యనారాయణ, దేవేందర్, శ్యాం, ప్రశాంత్‌రెడ్డి, రాజయ్య పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వనదేవతలను దర్శించుకున్న ఆర్డీఓ



ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మలను భూపాలపల్లి ఆర్డీఓ రమాదేవి మంగళవారం దర్శించుకున్నారు. ములుగు జిల్లాలో ఆర్డీఓగా పనిచేసిన రమాదేవి ఇటీవల భూపాలపల్లి ఆర్డీఓగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా అమ్మవార్లను ఆమె దర్శించుకున్నారు. గోవిందరాజు, పగిడిద్దరాజులకు పూజలు చేశారు. పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, సమ్మక్క పూజారి మునీందర్‌లు ఆర్డీఓకు చీర బహుకరించి, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సునీల్, ఎండోమెంట్ జూనియర్ అసిస్టెంట్లు రాజేశ్వర్‌రావు, మధు, మేడారం ప్రొటోకాల్ ఇన్‌చార్జ్ బొప్ప సమ్మయ్య, పూజారులు పాల్గొన్నారు.

మూడు రోజుల శిక్షణ



ములుగు: నేటి నుంచి 21వ తేదీ వరకు తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల పాటు రిసోర్స్ పర్సన్స్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈఓ పాణిని తెలిపారు. ఈ మేరకు మంగళవారం సమగ్రశిక్షణ క్వాలిటీ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ మండలం నుంచి సబ్జెక్ట్ తరపున ఇద్దరు ఉపాధ్యాయులు హాజరు కావాలని, బోధనోపకరణం తయారు చేసుకుని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వ్యూహాలను తయారు చేసుకోవాలని సూచించారు.

ములుగు ఎస్సైగా వెంకటేశ్వర్

ములుగు: ములుగు ఎస్‌హెచ్‌ఓ(ఎస్సై)గా రామగుండం కమిషనరేట్‌లో టాస్క్ ఫోర్స్ ఎస్సైగా బాధ్యతల్లో ఉన్న అప్పని వెంకటేశ్వర్ నియమితులయ్యారు. గతంలో ములుగులో ఎస్సైగా ఉన్న పవన్‌కుమార్‌ను అనివార్య కారణాలతో ఎస్పీ గాష్ ఆలం ఎస్పీకి అటాచ్ చేసిన విషయం తెలిసిందే. వాజేడు మండలంలోని పేరూరు ఎస్సై హరీశ్‌ను ములుగు వీఆర్‌కు అటాచ్ చేశారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు..



ములుగు/ములుగు రూరల్: నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇలా త్రిపాఠిని తన చాంబర్‌లో తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ తరపున మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నితిన్ కుమార్, వైద్యాధికారులు చంద్రకాంత్, పవన్, మధు, రణధీర్, శ్రీకాంత్, ప్రసాద్, రంజిత్, యమున తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్ యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజ్మీర క్రిష్ణవేణి నాయక్, సిరికొండ బలరాం, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, భూక్య రాజునాయక్, జవహర్‌లాల్, క్రిష్ణాకర్, సురేందర్ పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఏఎన్‌ఎంల నియామకం

ఏటూరునాగారం: ములుగు, భూపాలపల్లి జిల్లాల్లోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో, ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో 2023–24 విద్యా సంవత్సరానికి ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేయడానికి ఏఎన్ఎం ఉద్యోగం కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఐటీడీఏ పీఓ అంకిత్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏఎన్ఎంల నియామకం కొరకు ఆసక్తి కలిగిన ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలకు కలెక్టర్లతో ఎం ప్యానెల్ అయి ఉండాలని, కనీసం మూడేళ్లు ప్రభుత్వ రంగ సంస్థ ఉద్యోగాలను స్పాన్సర్ చేసిన అనుభవం ఉండాలని తదితర వివరాలు వెల్లడించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య



ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

వెంకటాపురం(కె): సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆస్పత్రిని సందర్శించి వైద్యశాలలో పరిసరాలను పరిశీలించారు. ఆస్పత్రిలో ఉన్న రోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సౌకర్యం సక్రమంగా అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం వైద్యశాలలో రికార్డులను పరిశీలించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వైద్య శాలకు వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం ఎదిర వైద్యశాలలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీతో సమావేశం నిర్వహించి తీసుకోవాల్సి చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అరవింద కుమార్, తహసీల్దార్ అంటి నాగరాజు, ఎంపీడీఓ అడ్డూరి బాబు, వైద్యాధికారి భవ్యశ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న ఓఎస్డీ, పక్కన అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్

ఓఎస్డీ అశోక్‌కుమార్

ములుగు: లొంగిపోయిన మావోయిస్టులకు పోలీసు శాఖ తరపున అండగా ఉంటామని ఓఎస్డీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో మంగళవారం ప్రధాన మంత్రి ఉపాధి కల్పనపై పోలీసు శాఖ, కేవీఐసీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓఎస్డీ మాట్లాడారు. మాజీ మావోయిస్టులకు స్వయం ఉపాధి కల్పించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. పరిశ్రమల శాఖ సహకారంతో రూ.లక్ష నుంచి 50లక్షల వరకు రుణాలు మంజూరు చేయడానికి అనుకూలంగా ఉన్నట్లు తెలిపారు. రుణాలు తీసుకునే వారు 10 రోజుల వరకు శిక్షణకు హాజరు కావాల్సి ఉంటుందని వివరించారు. ఎస్సీ, ఎస్టీలకు 35శాతం రాయితీ, ఇతరులకు 25 శాతం రాయితీ ఉంటుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సందేహాలకు కేవీఐసీ జిల్లా నోడల్ అధికారి సీహెచ్ రాజేష్ ఫోన్ నంబర్ 9493262703లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, ఎల్‌డీఎం రాజ్‌కుమార్, జనరల్ మేనేజర్ శ్రీనివాస్, ఆర్ఐ అడ్మిన్ వెంకటనారాయణ, ఆర్ఐ ఆపరేషన్స్ కిరణ్, రీజనల్ అధికారి అశోక్, డీపీఎం సతీష్, మాజీ మావోయిస్టులు సుమారు 200 మంది పాల్గొన్నారు.

ఏజెన్సీ గ్రామాల్లో సేవ చేయడం అభినందనీయం



కేన్సర్ నిర్ధారణ పరీక్షలను ప్రారంభిస్తున్న పీఓ అంకిత్

కొత్తగూడ: పట్టణాలకే పరిమితమై నిత్యం బిజీగా ఉండే వైద్యులు ఏజెన్సీ గ్రామాలకు వచ్చి సేవ చేయడం అభినందనీయమని ఐటీడీఏ ఏటూరునాగారం పీఓ అంకిత్ అన్నారు. రోటరీ క్లబ్ బంజారాహిల్స్, ఎంఎన్‌జే కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరాన్ని పీఓ ప్రారంభించి మాట్లాడారు. హైదరాబాద్ నుంచి మారుమూల ఏజెన్సీ గ్రామాలకు వచ్చి ఉచితంగా పరీక్షలు చేస్తున్నారని, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ అనిత మాట్లాడుతూ.. కేన్సర్ వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. పురుషుల్లో నోటి కేన్సర్, మహిళల్లో గర్భాశయ కేన్సర్ ఎక్కువగా వస్తున్నాయన్నారు. ప్రారంభ దశలో తెలుసుకుంటే వ్యాధిని నయం చేయవచ్చన్నారు. అందరూ ఓపికగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తమకు అవకాశం కల్పించిన కలెక్టర్ శశాంకకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్, ఎంపీపీ బానోతు విజయరూప్‌సింగ్, ఎంపీడీఓ భారతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, డాక్టర్లు మురళీనాయక్, శివప్రసాద్, ప్రత్యూష, ఎంఎన్‌జే ఆస్పత్రి రేడియాలజిస్ట్‌లు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ ఓటరు జాబితాపై దృష్టిసారించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఓటరు నమోదు ప్రక్రియ పరిశీలిస్తున్న కలెక్టర్

ములుగు: స్వచ్ఛ ఓటరు జాబితా రూపకల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐటీడీఏ పీఓ అంకిత్, అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్‌లతో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వారీగా స్త్రీ, పురుషుల ఓటర్ల నిష్పత్తిని సేకరించాలన్నారు. నూతన దరఖాస్తులను పరిశీలించి ఆమోదించాలని, తిరస్కరిస్తే కారణాలను తెలుపాలని సూచించారు. మరణించిన వారి ఓట్లను ఫారం 7, 8 ద్వారా తొలగించాలన్నారు. ఇంటింటా సర్వే పూర్తి చేసి పకడ్బందీగా అధికారులు వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఒకే ఇంట్లో 6 కంటే ఎక్కువ ఓట్లు ఉంటే ఇంటి నంబర్, సబ్ నంబర్లను గుర్తించి వివరాలను నమోదు చేయాలన్నారు. ఫారం 8 ద్వారా సబ్ నంబర్లను కేటాయించాలని వివరించారు. నేటితో ప్రక్రియను పూర్తి చేసి రేపటి నుంచి గ్రామాల వారిగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను నమోదు చేసి నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలని వివరించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఏఓ విజయభాస్కర్, తహసీల్దార్లు, డిప్యూటి తహసీల్దార్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ

ఎస్ఎస్ తాడ్వాయి: ఓటరు నమోదు, సవరణ పనుల్లో వేగం పెంచాలి కలెక్టర్ ఇలా త్రిపాఠి రెవెన్యూ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయాన్ని కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటర్ల నమోదు, సవరణ ఆన్‌లైన్‌లో చేస్తున్న పనితీరును పరిశీలించారు. ఇప్పటి వరకు ఓటరు నమోదు, సవరణ ఏ మేరకు పూర్తి చేశారని తహసీల్దార్ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితా మార్పులపై సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సౌకర్యాలపై ఆరా తీశారు.

కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన



కాళేశ్వరం: సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, ఆయన స్నేహితులు మంగళవారం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించారు. కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. అనంతరం కన్నెపల్లిలోని లక్ష్మీపంపుహౌస్ డెలివరి సిస్టర్న్ వద్ద మోటార్లు ఎత్తిపోస్తున్న జలాలను చూశారు. ఆటో స్క్వాడ్ పద్ధతిలో నడుస్తున్న మోటార్లను పరిశీలించారు. మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీ, అన్నారంలోని సరస్వతీ బ్యారేజీలను సందర్శించారు.

పెరుగుతున్న గోదావరి



ఏటూరునాగారం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు, కాళేశ్వరం, తుపాకులగూడెంలోని బ్యారేజీల నీటిని దిగువకు వదలడంతో మండల పరిధిలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి నది క్రమక్రమంగా పెరుగుతూ వస్తోంది. మంగళవారం సాయంత్రం 9.910 మీటర్ల నీటి మట్టం నమోదు అయ్యింది. వరద నీరు భారీగా లేకపోవడంతో భయపడాల్సిన అవసరం లేదని అధికారులు వెల్లడించారు.

వంట కార్మికుల సమ్మె వాయిదా..



సమ్మెను విరమింపజేస్తున్న దృశ్యం

ములుగు రూరల్: మధ్యాహ్న భోజన కార్మికులకు విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి ఇచ్చిన హామీ మేరకు సమ్మెను మంగళవారం నుంచి తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ తెలిపారు. ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు ఇందిరా పార్కు వద్ద నిర్వహించిన మహాధర్నాలో వేతనాలను విడుదల చేస్తామని మంత్రి ప్రకటించడం సంతోషకరమని తెలిపారు. ఈ మేరకు మంగళవారం డీఈఓ పాణిని సమ్మె శిబిరానికి వచ్చి మంత్రి హామీని తెలియజేయడంతో సమ్మెను వాయిదా వేసి మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు సామల రమ, ప్రధాన కార్యదర్శి గున్నాల రాజకుమారి, శోభ, ప్రమీల, శ్రీనివాస్, సమ్మక్క, ఫర్వీన, రమణ, పోచమ్మ, సరోజన, ఉమ, మణమ్మ, సరిత, భాగ్య, పద్మ పాల్గొన్నారు.

ఆస్పత్రులకు గర్భిణుల తరలింపు



బన్నాజీబంధం నుంచి గర్భిణిని తరలిస్తున్న సిబ్బంది

ఏటూరునాగారం: రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఏటూరునాగారం మండలంలోని ఎలిశెట్టిపల్లి – చెల్పాక గ్రామానికి మధ్యలో ప్రవహిస్తున్న దయ్యాలవాగు(జంపన్నవాగు) ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు స్తంభించినట్లు ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్ మంగళవారం తెలిపారు. అల్లంవారిఘణపురం గ్రామం వద్ద కనుగుల వాగు ప్రమాదకరంగా ఉండడంతో వీరాపురం గ్రామానికి చెందిన గర్భిణి సోలం వాణికి డెలివరీ సమయంలో దగ్గరపడడంతో ముందస్తుగా ఆమెను వాగు దాటించి ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించినట్లు తెలిపారు. ఎలిశెట్టిపల్లి వాగును ఎవరూ కూడా దాటొద్దని హెచ్చరించారు. ఏదైనా అవసరం ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని ఏఎస్పీ కోరారు. ఏఎస్పీ వెంట సీఐ రాజు, ఎస్సైలు గుర్రం కృష్ణప్రసాద్, శ్రావణ్, పోలీసులు, 108 సిబ్బంది ఉన్నారు. అదే విధంగా వీరాపురం, బన్నాజీబంధం గ్రామాలకు చెందిన ముగ్గురు గర్భిణులను సైతం సామాజిక ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కుమార్ తెలిపారు. బన్నాజీబంధం, వీరాపురం ప్రాంతాల నుంచి ట్రాక్టర్ సహాయంతో వారిని వాగులు దాటించి సీహెచ్‌సీ ఆస్పత్రికి ఆశ కార్యకర్తల పంపించినట్లు తెలిపారు. వాగులు మరింత ఉధృతంగా ప్రవహిస్తే పరిస్థితి ఇబ్బందిగా ఉంటుందని ముందస్తుగా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

లైంగికదాడి, హత్యకేసులో వ్యక్తికి జీవిత ఖైదు

కేసముద్రం: ఓ మహిళపై లైంగికదాడికి పాల్పడిన అనంతరం ఆమెను హత్యచేసిన ఓ వ్యక్తికి మహబూబాబాద్ కోర్టు మంగళవారం జీవితఖైదు శిక్ష విధించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. కేసముద్రం మండలంలో కాట్రపల్లి గ్రామానికి చెందిన మహిళ మాధవపెద్ది విజయ కేసముద్రంస్టేషన్‌లోని ఉప్పరపల్లి రోడ్డువైపు ఓ ఇంట్లో అద్దెకు ఉంటుంది. కాగా, 2011 ఆగస్టు 9న రాత్రి కరీంనగర్ జిల్లా కాటారం మండలం చెర్లపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి చల్లా మహేశ్.. విజయపై లైంగికదాడికి దాడికి పాల్పడిన అనంతరం ఆమెను హత్య చేశాడు. ఆ తర్వాత ఆమె మెడలో ఉన్న బంగారంతో వెళ్లిపోయాడు. దీనిపై నెక్కొండ మండలం నాగారం గ్రామానికి చెందిన మృతురాలి సోదరుడు కొంకాల వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసముద్రం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఎస్సై డేవిడ్‌రాజ్, రూరల్ సీఐ అంజయ్య.. నిందితుడిని రిమాండ్ చేశారు. అనంతరం చార్జీషీట్ ఫైల్‌చేయగా కోర్టు డ్యూటీ ఆఫీసర్ అశోక్‌రెడ్డి, సిబ్బంది రవీందర్, దేవా.. 23 మంది సాక్షులను కోర్టులో హాజరుపరించారు. కోర్టు పీపీ చిలకమారి వెంకటేశ్వర్లు బాధితుల తరపున వాదించారు. ఈ మేరకు మంగళవారం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి మహబూబాబాద్ చంద్రశేఖర్‌ప్రసాద్.. నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవితఖైదు శిక్షతోపాటు రూ.18వేల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. కాగా, నేరస్తుడికి శిక్ష పడేలా సాక్షులను ప్రవేశపెట్టిన డీఎస్పీ సత్యనారాయణ, రూరల్ సీఐ రమేశ్, ఎస్సై తిరుపతిని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించారు.

భార్యను హత్య చేసిన ఘటనలో భర్తకు..


సంపత్

టేకుమట్ల(రేగొండ): జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం గాంధీనగర్ గ్రామంలో 2019లో నమోదైన హత్య కేసులో పల్లబోయిన సంపత్ అనే నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ. పదివేల జరిమానా విధిస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా జడ్జి పి. నారాయణ బాబు మంగళవారం తీర్పునిచ్చారు. పల్లెబోయిన సంపత్, సుమలత దంపతులు గాంధీనగర్‌లో నివాసం ఉండేవారు. మద్యానికి బానిసైన సంపత్.. 2019 సంవత్సరంలో సుమలతతో గొడవ పడి కత్తితో పొడువగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై అప్పటి సీఐ సాయి రమణ కేసు నమోదు చేసి చార్జిషీట్ ఫైల్ చేయగా, ప్రస్తుత చిట్యాల సీఐ వేణు చందర్, రేగొండ ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ జ్యోతి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ ఘటనలో నేరం రుజువు కావడంతో సంపత్‌కు జీవిత ఖైదుతో పాటు రూ. 10వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి తీర్పును తీర్పునిచ్చారు. కాగా, ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించిన పి.పి జి. శివరాజు, నిందితుడికి శిక్ష పడేలా చర్యలు చేపట్టిన రేగొండ ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, చిట్యాల సీఐ వేణుచందర్, కోర్టు కానిస్టేబుల్ జ్యోతిని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ జే సురేందర్ రెడ్డి అభినందించారు.

రెడ్డి చికెన్ సెంటర్
Cell: 9989299661


కోచింగ్ సెంటర్‌లో క్లాస్ వింటున్న అభ్యర్థులు(ఫైల్)

కొలువు..గెలువు

- మైనార్టీ అభ్యర్థులకు సివిల్స్‌లో కోచింగ్
- దరఖాస్తుకు ఈనెల 23 వరకు గడువు
- వచ్చేనెల 6న స్క్రీనింగ్ టెస్ట్

న్యూశాయంపేట : సివిల్ సర్వీసెస్–2024 పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు శుభవార్త. తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనుంది. ఈ సంవత్సరంలో వందమంది అభ్యర్థులకు హైదరాబాద్‌లోని ప్రముఖ కోచింగ్ సెంటర్లలో ఉచిత శిక్షణ అందించనుంది. ఇందులో భాగంగా యూపీఎస్సీ, సీఎస్ఏటీ నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు అవసరమైన శిక్షణ అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైన్, బుద్దీస్, పార్శీ కులాలకు చెందిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. స్క్రీనింగ్ టెస్టులో సాధించిన మెరిట్ ఆధారితంగా కోచింగ్ సెంటర్‌లో అడ్మిషన్ ఇస్తారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆయా జిల్లా కేంద్రాల్లో ఉన్న మైనార్టీ గురుకులాల్లో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు.

అర్హత..

సివిల్స్ కోసం ప్రిపేరవుతున్న అభ్యర్థులు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని జనరల్, ప్రొఫెషనల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం రూ. రెండు లక్షలకు మించొద్దు. ఈ శిక్షణలో మహిళా అభ్యర్థులకు 33, దివ్యాంగుల కు 5 శాతం రిజర్వేషన్ ద్వారా సీట్లు కేటాయించారు. ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఉంటుంది.

దరఖాస్తుకు గడువు

సివిల్ సర్వీసెస్ స్క్రీనింగ్ టెస్ట్ కోసం డిగ్రీ పూర్తిచేసి సివిల్స్ కోసం ప్రిపేరవుతున్న అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.సీతఈటీ.జిఓవీ.ఇన్/టిమ్రిస్ నందు దరఖాస్తులు సమర్పించాలి. దరఖాస్తుకు గడువు ఈ నెల 23వ తేదీ.

స్క్రీనింగ్ టెస్ట్

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వచ్చే నెల(ఆగస్టు 6న) స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కేంద్రాల్లోని మైనార్టీ గురుకుల పాఠశాల్లో ఈ పరీక్ష నిర్వహిస్తారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మైనార్టీలు సివిల్స్‌లో సత్తా చాటేందుకు శాఖ పరంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇతర వివరాలకు 040–23236112 నంబర్‌లో గాని, ఆయా జిల్లాల మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయాల్లో సంప్రదించాలి.

కే.విక్రమ్‌కుమార్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి, వరంగల్

‘క్రీస్తుజ్యోతి’కి ప్రపంచ స్థాయి గుర్తింపు

- మందిరం వ్యవస్థాపకులు పాల్సన్ రాజ్, జయప్రకాశ్


మాట్లాడుతున్న పాల్సన్ రాజ్

ధర్మసాగర్: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురం గ్రామంలోని క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరానికి ప్రపంచస్థాయి గుర్తింపు రావడం ఎంతో అదృష్టమని మందిరం వ్యవస్థాపకులు దైవజనులు రెవరెండ్ డాక్టర్ సంగాల పాల్సన్ రాజ్, రెవరెండ్ డాక్టర్ గోపు జయప్రకాశ్ అన్నారు. ఈమేరకు మంగళవారం వారు ప్రార్థనా మందిరంలో విలేకరులతో మాట్లాడుతూ ఆసియా ఖండంలో అతిపెద్దగా సుమారు 40 వేల మంది క్రైస్తవ విశ్వాసులు ఒకే సారి దేవుడి ప్రార్థనలో గడిపేలా అన్ని హంగులతో క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరాన్ని నిర్మించామన్నారు. దీనిని మే 4వ తేదీన ప్రారంభించామన్నారు. చర్చి ప్రత్యేకత, తమ సేవ పరిచర్యను తెలుసుకుని రెండు అంతర్జాతీయ అవార్డులకు ఎంపిక చేశారన్నారు. ఈ మేరకు జూన్ 16న యూఎస్ కాంగ్రెస్ మెన్ డానికె డేవిడ్ పీస్ ప్రైజ్ 2023, యూఎస్ హౌజ్ ఆఫ్ రిప్రజెంటివ్ కాంగ్రెస్‌నల్ రివార్డు మెడల్, ప్రశంస పత్రం యూఎస్ ఎంపీ జోనతన్ జాక్సన్ చేతుల మీదుగా అందజేశారని తెలిపారు. ఈ రెండు అంతర్జాతీయ అవార్డులు రావడం ఆనందంగా ఉందని, అవార్డులు ప్రదానం చేసిన అమెరికా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

‘మోడల్’ టీచర్లపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..


విచారణ చేపడుతున్న ఉన్నతాధికారులు

జనగామ రూరల్: మండలంలోని చౌడారం మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు.. తమను మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విద్యార్థుల లేఖపై ‘సాక్షి’లో ప్రచురితమైన ‘రూపాయి బిల్లా, బాయిలా బంగారం ’అనే కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం విచారణ చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన కథనంపై విద్యాశాఖ మంత్రి దృష్టికి రాగా కలెక్టర్ వెంటనే స్పందించి డీఈఓను విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ కమిటీని నియమించారు. మంగళవారం నోడల్ అధికారి ఆధ్వర్యంలో వివిధ విద్యార్థి సంఘాల వాయిస్‌లతో విద్యార్థినులు, ఉపాధ్యాయులను విచారించారు. నివేదికను బుధవారం ఉన్నతాధికారులకు అందజేయనున్నారు.

ప్రిన్సిపాల్‌తో పాటు సంబంధిత ఉపాధ్యాయులను తొలగించాలి

మోడల్ పాఠశాలలో విద్యార్థినులను ఇబ్బందులకు గురి చేసిన ఉపాధ్యాయులతో పాటు పూర్తి బాధ్యతగా ప్రిన్సిపాల్‌ను కూడా తొలగించాలి. ఏ పాఠశాలలో కూడా ఇలాంటి ఘటన జరగకుండా చర్యలు తీసుకోవాలి.

–చిలువేరు అభిగౌడ్, ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం

హన్మకొండ: ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ తూపురాణి సీతారాం అన్నారు. మంగళవారం హనుమకొండలో అసోసియేషన్ నాయకుడు ఇ.నరేందర్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు వాటిని పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ నెల 20న హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద ధర్నా చేయనున్నట్లు వివరించారు. ప్రతి నెల మొదటి తేదీన పెన్షన్లు చెల్లించడం లేదని, కార్పొరేట్ హాస్పిటళ్లలో హెల్త్ కార్డులపై వైద్యం అందించడం లేదన్నారు. జూలై 1 నుంచి వర్తించే కొత్త పే రివిజన్ కమీషన్ ఇంతవరకు వేయలేదని, బకాయి కరువు భత్య వాయిదాలను ప్రకటించలేదని మండిపడ్డారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నారాయణగిరి వీరన్న, భేతి శంకర్ లింగం, ఆర్తి సంపత్ కుమార్, కరేటి శంకర్‌రావు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నిరంతర ఉచిత విద్యుత్


మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి: రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో రోజు నిరంతరంగా ఉచిత విద్యుత్ ఇస్తుండగా.. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మాత్రం మూడు గంటలే ఇస్తున్నారని చెప్పడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం పాలకుర్తిలో రైతులతో ఏర్పాటు చేసిన సభలో మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో రైతులను పట్టించుకోలేదన్నారు. మూడేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ కుమార్, ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, జడ్పీకోఆప్షన్ సభ్యుడు ఎం.డి మదార్, పాలకుర్తి సర్పంచ్ వీరమనేని యాకాంతారావు, ఏఎంసీ చైర్మన్ ముస్కు రాంబాబు, సహకార సంఘం చైర్మన్ బొబ్బాల అశోక్ రెడ్డి, మాచర్ల ఎల్లయ్య, భూమ రంగయ్య పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల రాస్తారోకో


ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద రాస్తారోకో చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు

- రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ స్టేట్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జాక్ (కేయూ)ఆధ్వర్యంలో మంగళవారం వర్షంలోనే హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం కళాశాల ఎదుట రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా జాక్ కన్వీనర్ డాక్టర్ చిర్రరాజు, వైస్ చైర్మన్ డాక్టర్ బి వెంకటగోపీనాథ్ మాట్లాడుతూ యూనివర్సిటీల్లో 15 నుంచి 20 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నామని, తమను రెగ్యులరైజ్ చేయాలని కొంతకాలంగా కోరుతున్నామన్నారు. సీఎం కేసీఆర్ గతేడాది జూలై 18న హనుమకొండకు వచ్చిన సందర్భంలో తమను రెగ్యులరైజ్ చేయాలని కోరగా చేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేర్చాలన్నారు. ఇటీవల కూడా మంత్రులు ,ఇతర ప్రజాప్రతినిధులకు కూడా వినతిపత్రాలు సమర్పించామన్నారు. ఇటీవలనే ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్లు, పాలిటెక్నిక్ కళాశాలల లెక్చరర్లను రెగ్యులరైజ్ చేశారన్నారు. అలాగే, యూనివర్సిటీల కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను కూడా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కాగా, రాస్తారోకోతో కొంత సేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. కార్యక్రమంలో రాష్ట్ర జాక్ కోకన్వీనర్ డాక్టర్ మంతెన శంకరయ్య, బాధ్యులు డాక్టర్ టి రాధిక, డాక్టర్ టి నాగయ్య, డాక్టర్ భిక్షపతి, డాక్టర్ రమేశ్, శ్రీదేవి, సునీత, కనకయ్య, స్వామి, ప్రసాద్, కర్రె సదాశివ, మామిడి లింగయ్య, పుల్లా రమేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పుప్పాలగుట్టలో సైకో వీరంగం

- ఇంట్లోకి చొరబడి ఓ వ్యక్తిపై దాడి
- ఆస్పత్రికి తరలింపు


స్థానికులు విద్యుత్ స్తంభానికి కట్టేసిన సైకో ఇతనే..

ఖిలా వరంగల్: వరంగల్ పుప్పాల గుట్టలో ఓ సైకో వీరంగా సృష్టించాడు. ఓ ఇంట్లోకి చొరబడి అ కారణంగా యువకుడిపై రోకలి బండతో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కాలనీకి చెందిన కొండేటి అంజమ్మ, సాయిలు దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు శ్రీనివాస్(33) ఉన్నారు. కాగా, ఏపీలోని కాకినాడ రామచంద్రపురం గ్రామానికి చెందిన నీలం సత్యనారాయణకు మనసిక స్థితి సరిగా లేదు. ఈ క్రమంలో వరంగల్ చింతల్ బ్రిడ్జి సమీపాన రైలు దిగి కాలనీలోకి ప్రవేశించాడు. అనంతరం అనుకోకుండా శ్రీనివాస్ ఇంటి తలుపులను బలంగా కొట్టడంతో ఊడి కిందపడ్డాయి. వెంటనే పక్కన ఉన్న రోకలి బండతో ఇంట్లోకి ప్రవేశించి శ్రీనివాస్‌పై దాడి చేయగా ఆయనకు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు క్షతగాత్రుడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. అడ్డుకోపోయిన మరో ఇద్దరిపై సైకో దాడికి పాల్పడ్డాడు. దీనిపై కుటుంబీకులు కేకలు వేయగా కాలనీ వాసులు చేరుకుని సైకోను పట్టుకుని దేహశుద్ధి చేసి మిల్స్ కాలనీ పోలీసులకు అప్పగించారు. పలుమార్లు విచారించిన సమాధానం చెప్పలేని చెప్పలేదు. కనీసం పేరు కూడా చెప్పలేని స్థితిలో ఉన్నాడు. అతడి మానసిక స్థితి సరిగా లేదని సీఐ శ్రీనివాస్ తెలిపారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు కాగా, సైకో దాడిలో గాయపడిన కొండేటి శ్రీనివాస్‌ను స్థానిక సామాజిక వేత్త ఎల్.శ్రీనివాస్ పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు.

SAHASRA INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES
Near Ayyappa Swami Temple, Mulugu Road, Warangal.
(Approved by PCI and Affiliated to Kakatiya University)
Contact Numbers : 7702389995, 9966866615, Email: sipswgl@gmail.com
WALK IN FACULTY RECRUITMENT
Applications are invited for the Posts of Teaching Staff (PROFESSOR, ASSOCIATE PROFESSOR AND ASSISTANT PROFESSOR) in the Department of Pharmaceutics, Pharmaceutical Chemistry, Pharmaceutical Analysis, Pharmacology, Pharmacognosy & Pharmacy Practice and office staff. Interested candidates may apply with detailed Resume along with original certificates and self attested copies of testimonials with recent 2 passport size photographs within 1 week from the date of notification.
Sd/- Management

వేర్వేరు చోట్ల ఏడుగురి అదృశ్యం..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఏడుగురు అదృశ్యమయ్యారు. వరంగల్ కాశిబుగ్గలో స్నేహితుడి వద్దకు వెళ్లిన ఓ విద్యార్థి.. భర్త వేధింపులు భరించేలేక హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లికి చెందిన ఓ వివాహిత తన ఇద్దరి పిల్లలతో కలిసి.. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారంలో ఓ యువతి.. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ బజార్‌కు చెందిన ఆటో డ్రైవర్ .. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి జమాండ్లపల్లికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యారు. వీరి ఆచూకీ కోసం ఆయా కుటుంబాలు బంధువులు, తెలిసిన చోట్లలో వెతికారు. అయినా ఫలితం లేకపోవడంతో ఆయా పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేశారు.

హసన్‌పర్తి : భర్త వేధింపులు భరించలేక భార్య తన ఇద్దరి పిల్లలతో కలిసి అదృశ్యమైంది. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కేశాపూర్‌కు చెందిన బోనగిరి యాదగిరి చిన్నకూతురు మమతతో ఆరేళ్ల క్రితం హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లికి చెందిన ఆళ్ల ప్రభుకు వివాహం జరిగింది. ఇతర లాంఛనాలతోపాటు వ్యవసాయ భూమిని కట్నం కింద ఇచ్చారు. వీరికి కుమారుడు అక్షర్(5),కూతురు చిచ్చు(3)ఉంది. భూమి విషయమై దంపతుల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి భూమికి సంబంధించిన వాటా డబ్బు కూడా ప్రభుకు అందించారు. అయినా ప్రభు మారకపోవడంతో మమత తన పిల్లలను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీనిపై తండ్రి యాదగిరి.. భర్త వేధింపులు భరించలేక తన కూతురు మమత ఇంటి నుంచి వెళ్లిందని సోమవారం రాత్రి పోలీసుకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హసన్‌పర్తి ఎస్సై సురేశ్ తెలిపారు.

కాశిబుగ్గలో విద్యార్థి..

రామన్నపేట : కాశిబుగ్గకు చెందిన పరికిపండ్ల శ్రీధర్ కుమారుడు సిద్ధార్థ అదృశ్యమయ్యారు. ఈ నెల 14వ తేదీన రాత్రి 7 గంటలకు తన స్నేహితుడి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పిన ఆ యువకుడు.. ఇంత వరకూ ఇంటికి తిరిగిరాలేదు. దీంతో తండ్రి శ్రీధర్ ఇంతేజార్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిద్దార్థ.. ఇంటి నుంచి వెళ్లిన సమయంలో బూడిదరంగు టీషర్టు, బ్లాక్ కలర్ నైట్ ప్యాంట్ ధరించాడు. సిద్దార్థ ఆచూకీ తెలిసిన వారు ఇంతేజార్‌గంజ్ పీఎస్‌లో సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ పేర్కొన్నారు


సిద్ధార్థ

బ్రాహ్మణ బజార్‌లో యువకుడు..

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ బజార్‌కు చెందిన సయ్యద్ సోహెల్ అదృశ్యమయ్యాడు. సోహెల్ హైదరాబాద్‌లో టాక్సీ ఆటో నడుపుకుంటూ అక్కడే ఉంటున్నాడు. బక్రీద్ సందర్భంగా ఈ నెల 6వ తేదీన ఇంటికి వచ్చాడు. పండుగ అనంతరం హైదరాబాద్ వెళ్లాడు. అయితే సోహెల్ ఫోన్ చాలా రోజుల నుంచి కలవకపోవడంతో తండ్రి ఫైజోద్దీన్.. ఈ నెల 17వ తేదీన టాక్సీ యజమానికి ఫోన్ చేసి తన కుమారుడి గురించి ఆరా తీశాడు. సోహెల్ డ్యూటీకి రావడంలేదని యజమాని వివరణ ఇచ్చాడు. దీంతో ఫైజోద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని టౌన్ ఎస్సై ఎస్.రవి మంగళవారం తెలిపారు.

పెద్ద ముప్పారంలో యువతి..

దంతాలపల్లి: మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని పెద్దముప్పారంలో ఓ యువతి అదృశ్యమైంది. గ్రామానికి చెందిన హెచ్ ఐలయ్య, తన భార్య.. పని నిమిత్తం నెల 11వ తేదీన రాత్రి బయటకు వెళ్లి 12న ఉదయం ఇంటికి చేరుకున్నారు. అయితే ఇంటి వద్ద తమ కూతురు కనిపించకపోవడంతో పలుచోట్ల వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో ఐలయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగదీశ్ తెలిపారు.

జమాండ్లపల్లిలో వ్యక్తి..

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి జమాండ్లపల్లికి చెందిన దొండేటి రమేశ్ అదృశ్యమయ్యాడు. రమేశ్.. నెల క్రితం భార్య సుజాతతో గొడవపడ్డాడు. దీంతో ఆమె జమాండ్లపల్లి నుంచి వెళ్లిపోయి ఖమ్మంలోని తన పెద్ద కుమారుడు నరేశ్ ఇంటి వద్ద ఉంటుంది. ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీ నుంచి రమేశ్ జమాండ్లపల్లిలోని తన ఇంటి వద్ద కనిపించడం లేదు. దీనిపై రమేశ్ కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై రాంచరణ్ మంగళవారం తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి


స్వరూప(ఫైల్)

టేకుమట్ల(రేగొండ): పాముకాటుతో మహిళ మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం లింగాలలో జరిగింది. గ్రామానికి చెందిన ముత్యాల స్వరూప(45) తన ఇంటి వద్ద గల మొక్కజొన్న కుప్పపై పరదా తొలగిస్తోంది. ఈ క్రమంలో పరదా లోపల ఉన్న పాము కాటు వేసింది. దీంతో కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. దీనిపై మృతురాలి భర్త రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

గంజాయి పట్టివేత కేసులో..

- ఒకరికి పదేళ్ల జైలు
- రూ. లక్ష జరిమానా

మహబూబాబాద్ రూరల్: గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో ఒకరికి పదేళ్ల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్ మంగళవారం తీర్పు ఇచ్చారు. మహబూబాబాద్ టౌన్ సీఐ వై.సతీశ్ కథనం ప్రకారం గతేడాది ఆగస్టు 8వ తేదీన అప్పటి టౌన్ ఎస్సై కె.క్రాంతికిరణ్ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తున్నారు. శ్రీనివాస సెంటర్‌లో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా రెండు బ్యాగులతో కనిపించగా అతడిని విచారించారు. రెండు బ్యాగుల్లో పరిశీలించగా 5 కేజీల ఎండు గంజాయి లభించింది. ఒడిశాలోని గంజాం జిల్లా నెయాలీశ్రీనిబాసపూర్ గ్రామానికి చెందిన తపన్ గౌడ్ ఒడిశా నుంచి గంజాయిని తీసుకువస్తున్నట్లు గుర్తించారు. పట్టుకున్న గంజాయిని టౌన్ సీఐ వై.సతీశ్‌కు అప్పగించి అప్పటి టౌన్ ఎస్సై కె.క్రాంతికిరణ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. విచారణ ద్వారా గతేడాది నవంబర్ 19న మహబూబాబాద్ జిల్లా కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. కోర్టు డ్యూటీ అధికారులు హెడ్ కానిస్టేబల్ బీరం సంపత్‌రెడ్డి, కానిస్టేబుల్ బానోత్ మోహన్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన జిల్లా కోర్టు పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు కోర్టులో వాదనలు వినిపించారు. వాదనలు విన్న మానుకోట జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్ నేరం నిరూపణ కావడంతో తపన్ గౌడ్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కాగా, నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ శరత్ చంద్ర పవార్, డీఎస్పీ సత్యనారాయణ అభినందించారు.

ఆన్‌లైన్ మోసం ..

- రూ.3.80 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

మహబూబాబాద్ రూరల్ : టెలిగ్రామ్ యాప్ పేరుతో వచ్చిన కాల్‌ను ఓ వ్యక్తి నమ్మాడు. అనంతరం తన ఫోన్‌కు వచ్చిన లింక్‌లో రూ.3.80 లక్షలు పెట్టుబడి పెట్టి పోగొట్టుకున్నాడు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్జీఓస్ కాలనీకి చెందిన పెరుమాండ్ల శ్రవణ్‌కుమార్ సెల్ ఫోన్‌కు కొద్ది రోజుల క్రితం ఒక మెసేజ్ వచ్చింది. అధిక మొత్తంలో పెట్టుబడి పెడితే, అధిక లాభం వస్తుందని ఆ మెసేజ్‌లో ఉంది. దీంతో శ్రవణ్ కుమార్ సదరు యాప్‌లో ఈ నెల 15, 16, 17 తేదీల్లో రూ.3.80 లక్షలు పెట్టుబడిగా పెట్టాడు. ఈ క్రమంలో మంగళవారం లింక్ ఓపెన్ చూడగా తన డబ్బు వివరాలు కనిపించలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన శ్రవణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని మహబూబాబాద్ టౌన్ సీఐ వై.సతీశ్ తెలిపారు.

మాట మార్చిన ప్రేమికుడు..

- రెండేళ్ల తర్వాతే పెళ్లని బుకాయింపు..
- ప్రియురాలు, బంధువుల నిరసన

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలో ప్రేమ వ్యవహారం బెడిసికొట్టింది. స్థానికులు, ఇరు వర్గాల బంధువుల కథనం ప్రకారం గీసుకొండకు చెందిన ఇంటర్ పూర్తి చేసిన యువతి, అదే మండలం బాలయ్యపల్లికి చెందిన డిగ్రీ చదివిన యువకుడు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం పెద్దలకు తెలియడంతో వారి ప్రేమ వ్యవహారం వివాదంగా మారింది. సదరు యువకుడితో పాటు అతడి బంధువులు ఆ యువతితో పెళ్లికి ససేమిరా అంగీకరించకపోగా మాట మార్చి రెండేళ్ల తర్వాత పెళ్లి అంటూ బుకాయిస్తున్నారు. దీంతో యువతి, ఆమె బంధువులు సోమవారం రాత్రి ప్రియుడి ఇంటి వద్ద నిరసన తెలిపారు. రెండేళ్లు కాదు..వెంటనే వివాహం జరగాలని పట్టుబట్టారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో యువకుడి బంధువులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఆందోళన చేస్తున్న వారిని అక్కడి నుంచి పంపించి శాంతింపజేశారు. కాగా, సోమ, మంగళవారాల్లో ఇరువర్గాల మధ్య రాజీ చర్చలు జరిగినా అవి ఫలించలేదని తెలుస్తోంది.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE
16 పండ్ల మొక్కలతో, వాస్తుకు అనుగుణంగా, పక్కా డాక్యుమెంట్స్‌తో రూ. 2,50,000/–లకే ఫామ్ ల్యాండ్ (121గ॥) కొనండి. Hero Bike ఉచితంగా పొందండి. 9154047148, 9700518878 [WA-7203]

WANTED
HNK, WGL లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. 8 గం॥ 12 గం॥ డ్యూటీలు కలవు. జీతం: 12000–16000. సెల్: 9703637320 [WA-5370]

3yr. ITR CA Auditing 12A 80G CSR Pan Card Nitiaayog BRL MSME Social Justice ISO సర్టిఫికెట్లు కలిగిన NGO నందు ఫండింగ్ & సేవ చేయుటకు స్త్రీ/పు కావలెను. నెలకు 21K+, 81439 09459 [M-1221340]

ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. 88854 86421. [M-1221457]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/–రూ॥ అదనపు లైను 60/– రూ॥ మాత్రమే 5% GST అదనము

WANTED TEACHERS
Wanted Applications from Qualified and experienced teachers having excellent communication skills for all subjects (Pre Primary, Primary and Upper primary) IIT, Abacus, Computer, Instructor, A good calligrapher contact immediately. Shantiniketan High School, Near Durgeshwara Swamy Temple, Warangal. Cell: 7995850051. [WA-16631]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.